TGTEL/26/A6780

# స్పందన
తెలుగు దినపత్రిక

సంపుటి :05 | సంచిక :01 | పేజీలు 8 వెల : 5 | సోమవారం 14 సెప్టెంబర్ 2026






పాఠకులు, ప్రకటనకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులకు
**“స్పందన ”**
వినాయక చవితి శుభాకాంక్షలు.

**సెలవు**

వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం “ స్పందన ” కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం (15-09-2026) సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

# ఐక్యంగా ఉన్నప్పుడే రాజకీయంగా
# అవకాశాలు

**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ**

**ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు**

**ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన**

**తమ ప్రభుత్వం వెన్నంటి ఉంటుందని భరోసా**

**“సమాజ సంక్షేమానికి మీరు అందిస్తున్న తోడ్పాటును గుర్తించి ప్రభుత్వం మీ వెన్నంటి ఉంటుంది. ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారంతో పాటు అవసరమైన అన్ని రకాల ఆర్థిక సహాయాన్ని అందిస్తాం. నేను మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తా. ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారు. చాలామంది పేదలు ఉన్నా పేదరికాన్ని కడుపులోనే దాచుకుని గౌరవంతో జీవించే స్వభావం మీది. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి పూచీకత్తు లేకపోయినా పేదలకు ఆర్థిక సహాయం చేసే కమ్యూనిటీ”**



హైదరాబాద్ రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోవాలంటే.. తగిన అవకాశాలు, ప్రాధాన్యం పొందాలంటే ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో ప్రసంగించారు. ఆర్యవైశ్య సమాజం ఆర్భాటాలు, ప్రచారాలకు దూరంగా ఉండటంతో రావాల్సినంత గుర్తింపు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వంలో ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చామని.. కొడంగల్‌లోని మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇచ్చామని గుర్తు చేశారు. అని సీఎం కొనియాడారు.

**నా రాజకీయ భవిష్యత్తును తొలుత గుర్తించింది రోశయ్యే**

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఏకైక నాయకుడు మహాత్మాగాంధీ. ఆయన ఆర్యవైశ్యుల బిడ్డ కావడం దేశానికే గర్వకారణం. లాలాలజపతిరాయ్, సీతారాం కేసరి, పెండేకంటి వెంకటసుబ్బయ్య వంటి ప్రముఖ నాయకులు ఈ సామాజికవర్గం నుంచి వచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున విశేష సేవలు అందించారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. నేను మొదటిసారి ఎమ్మెల్సీగా ఎన్నికై శాసనమండలిలో దూకుడుగా వ్యవహరిస్తున్నప్పుడు రోశయ్య దగ్గరికి పిలిచారు. నా రాజకీయ భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. ఆవేశంతో కాదు అనుభవంతో ముందుకెళ్తే రాజకీయాల్లో పైకి వస్తావని సుదీర్ఘ భవిష్యత్తు ఉందని ఆశీర్వదించారు. రోశయ్యకు సముచిత గౌరవాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ నడిబొడ్డున విగ్రహం ఏర్పాటు చేస్తే కొంతమంది విమర్శలు చేశారు. ‘నాలుగు దశాబ్దాల క్రితమే నేను బల్కంపేటకు వచ్చా.. మంచైనా, చెడైనా నాకు హైదరాబాదే’ అని రోశయ్య ఒక సందర్భంగా చెప్పారు. ఆయన మాటలు గౌరవించి నగరంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశాం” అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**సభలో పాల్గొన్న ఆర్యవైశ్యులు**

**రేవంత్‌రెడ్డి గట్టిగా ఉంటే.. ఎంతో మంది జైల్లోనే..!: టీజీ వెంకటేశ్**

‘సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడినంత గట్టితనం చేతల్లో ఉండదు.. అదే గట్టితనం ఉంటే తెలంగాణలో ఎంతో మంది కటకటాల్లోకి పోయేవారు’ అని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. సూర్య భగవానుడు ఎలా వెలుగునిస్తున్నారో..

అలాగే సీఎం తెలంగాణ

ప్రజలకు సేవలందిస్తున్నారంటూ రేవంత్ పేరు గురించి వర్ణించారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తన వంతుగా రూ.కోటి విరాళం ప్రకటించారు. సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది

లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి డా.వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, సూర్యనారాయణగుప్తా, ప్రకాశ్‌గౌడ్, నవీన్‌యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, దామోదర్‌గుప్తా, మాజీ కార్పొరేటర్లు రజితారెడ్డి, బొంతు శ్రీదేవి పాల్గొన్నారు.



**మహాపూజకు వేళాయే..**
**‘పంచముఖ సంకటహార**
**మహాగణపతి**

ఖైరతాబాద్ మహా గణపతి పూర్తి రూపంతో భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. సోమవారం నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. పూర్తిగా మట్టితో తయారు చేసిన ఈ విగ్రహం 70 అడుగుల ఎత్తులో ‘పంచముఖ సంకటహార మహాగణపతి’గా భక్తుల ముందుకువచ్చారు. ఆదివారం రాత్రి పనులు పూర్తి కావడంతో ఇలా దర్శనం ఇచ్చాడు.



-2లో

## మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసినందుకు
# బాధపడడం లేదు

మంత్రి పదవిని ఎలాంటి ఆరోపణలు లేకుండా నిర్వహించా

పార్టీ మారే ఆలోచన లేదు  కాంగ్రెస్ లోనే కొనసాగుతా

మళ్లీ ఎన్నికల్లో తూర్పు టికెట్ నాకే.. విజయం నాదే

రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసి తీరుతాం

మాజీ మంత్రి కొండా సురేఖ, మురళి దంపతుల ప్రకటన

పశ్చిమ నియోజకవర్గం లో నాడు వినయ్భాస్కర్ ను తట్టుకోలేక మమ్మల్ని బతిమాలి తీసుకెళ్లేవాడని ఎద్దేవా చేశారు. స్థానిక డివిజన్లో కార్పొరేటర్ ను గెలిపించుకునే స్థాయి కూడా సారయ్యకు లేదని విమర్శించారు.

## సర్దార్ పటేల్ దృఢ సంకల్పం, అమరవీరుల త్యాగఫలమే హైదరాబాద్ విముక్తి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు

**ఆపరేషన్ పోలో అమరవీరులకు ఘన నివాళి, మాజీ సైనికులకు సన్మానం**

**సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి - పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్రను చేర్చాలని డిమాండ్**



-2లో

## సభ జరగకుండా ఆ రెండు పార్టీలు నాటకం



హైదరాబాద్: శాసనసభ సమావేశాలు సాగుతున్న తీరును రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా సమస్యలను నిలదీస్తున్న భాజపా గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ పార్టీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సభ నడవకుండా కాంగ్రెస్, భారాసలు కలిసి నాటకం ఆడాయని మండిపడ్డారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ‘సభలో భాజపా బాధ్యతాయుతంగా అవినీతి, భూ అక్రమాలపై గళమెత్తుతుంటే.. మంత్రులు మైకులు కట్ చేయిస్తూ అసెంబ్లీని తప్పుదోవ పట్టిస్తున్నారు. మొదటి మూడు రోజుల పాటు భారాస, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకరినొకరు దూషించుకున్నట్లు నటిస్తూ.. ఉద్దేశపూర్వకంగా సభ సమయాన్ని వృథా చేశాయి.



## సైమా అవార్డ్స్
# 2026

## ఉత్తమ నటుడు నాగచైతన్య...
**‘సంక్రాంతికి...’ 6 అవార్డులు**

స్పందన
తెలుగు దినపత్రిక

# అసెంబ్లీలో నడిచింది సభ కాదు... కాంగ్రెస్--బీఆర్ఎస్ పార్టీల నాటకం

**రూ.33 వేల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదు.**

**లక్షల కోట్ల భూదోపిడీ గుట్టు విప్పిన బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



గత ఐదు రోజులుగా శాసనసభ సమావేశాలు సాగుతున్న తీరును రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా సమస్యలను నిలదీస్తున్న బీజేపీ గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బీజేపీ బాధ్యతాయుతంగా అవినీతి, భూ అక్రమాలపై గళమెత్తుతుంటే మంత్రులు మైకులు కట్ చేయిస్తూ అసెంబ్లీని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మొదటి మూడు రోజుల పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై ఒకరినొకరు దూషించుకుంటూ ఉద్దేశపూర్వకంగా సభ సమయాన్ని వృథా చేశాయని, చివరి రోజున 22వ నిషేధిత జాబితాపై చర్చ పేరుతో సంబంధిత మంత్రి ఏకంగా నాలుగు గంటల పాటు మతిభ్రమించినట్లు మాట్లాడారే తప్ప 50 లక్షల మంది రైతులు, పేద వర్గాలకు సంబంధించిన సమస్య పరిష్కారానికి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. 22వ సెక్షన్లను కోర్టు నిర్ణయించిందని మంత్రి చెప్పడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని, చట్టాలు చేసేది చట్టసభలు, జీవోలు ఇచ్చేది ప్రభుత్వమే తప్ప కోర్టులు కావని స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలపై నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, 13 వేల లావాదేవీల ద్వారా దాదాపు 23 లక్షల ఎకరాల ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని మంత్రులే సభలో అంగీకరించిన వీడియో రికార్డులను ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. ఇంత భారీ కుంభకోణం జరిగిందని తెలిసినా ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, భూములను ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని నిలదీశారు. రిజిస్ట్రేషన్ అనేది టైటిల్ డీడ్ కాదని, తప్పుడు రిజిస్ట్రేషన్లను రద్దు చేసే పూర్తి అధికారం ప్రభుత్వానికి ఉన్నా ఎందుకు తాత్సారం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. దోపిడీ జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ఆడిట్ నివేదికను ప్రజల ముందు ఎందుకు ఉంచడం లేదని, గతంలో వేసిన సిట్ కాకుండా కొత్తగా వేసిన సెట్ కేవలం సెట్టింగ్‌లు చేసుకునేందుకేనా అని ప్రశ్నించారు. ఈ మొత్తం భూ బాగోతంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అనే పేరుతో హైదరాబాద్ పరిసరాల్లోని వేలాది ఎకరాల అసైన్డ్ భూములను కారుచౌకగా కాజేసేందుకు కొత్త దందా మొదలుపెట్టారని ఏలేటి ఆరోపించారు. పేద అసైనీల నుంచి ముందే బాండ్ పేపర్లు, నోటరీలు రాయించుకొని, తర్వాత వారికే ఫ్రీహోల్డ్ కల్పిస్తున్నట్లు చట్టాలు తెచ్చి లక్షల కోట్ల విలువైన ఆస్తులను తమ పేర్ల మీద మార్చుకునే పథకం రచిస్తున్నారని విమర్శించారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని ఐడీపీఎల్ కు చెందిన 333 ఎకరాల విలువైన భూమి ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ, దాదాపు రూ.33 వేల కోట్ల విలువైన ఈ భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదని, ప్రభుత్వ పెద్దలకు ఇందులో 30 శాతం వాటాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. అక్రమాలు జరిగినట్లు తేలినా బాధ్యులైన అధికారులపై పీడీ యాక్ట్ పెట్టడం గానీ, సస్పెండ్ చేయడం గానీ ఎందుకు చేయలేదని నిలదీశారు.

హైడ్రా పేరిట ప్రభుత్వం పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. మూసీ నదికి 100 మీటర్ల దూరంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల చిన్న ఇళ్లను రాత్రికి రాత్రే బుల్డోజర్లతో కూల్చివేస్తున్న ప్రభుత్వం, మూసీ నది మధ్యలోనే మూడు ఎకరాల స్థలాన్ని ఆక్రమించిన పెద్దల జోలికి ఎందుకు వెళ్లడం లేదని, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇచ్చిన నోటీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకే చెందిన ప్రజాప్రతినిధుల భూవ్యవహారాలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు మౌనం వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు. మరోవైపు సంబంధిత మంత్రికి ఉన్న వ్యాపార ప్రయోజనాలు, అక్రమ మైనింగ్ వ్యవహారాలపై నోటీసులు రావడం, ప్రభుత్వంలో ఉంటూనే రూ.1,400 కోట్ల కాంట్రాక్టులను రివైజ్డ్ ఎస్టిమేషన్ల పేరుతో రూ.4,000 కోట్లకు పెంచుకోవడం ముమ్మాటికీ కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్, క్విడ్-ప్రో-కో కాదా అని సూటిగా ప్రశ్నించారు.

అధికారంలో ఉన్నామని విర్రవీగితే చూస్తూ ఊరుకోబోమని, తమ వద్ద 200లకు పైగా పక్కా ఆధారాలతో కూడిన కేసు స్టడీలు ఉన్నాయని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఆడుతున్న ఈ దోపిడీ నాటకాన్ని ప్రజల ముందు బట్టబయలు చేస్తామన్నారు. ఈ అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను, గౌరవ గవర్నర్‌ను కలుస్తామని, అవసరమైతే రాజ్యాంగ పుస్తకం చేతబట్టి తిరిగే రాహుల్ గాంధీ నివాసం ముందే ఢిల్లీలో ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ నీతిని దేశవ్యాప్తంగా ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు

# సర్దార్ పటేల్ దృఢ సంకల్పం, అమరవీరుల త్యాగఫలమే హైదరాబాద్ విముక్తి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు



**ఆపరేషన్ పోలో అమరవీరులకు ఘన నివాళి, మాజీ సైనికులకు సన్మానం**

**సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి - పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్రను చేర్చాలని డిమాండ్**

భారతదేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన ఆపరేషన్ పోలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆత్మబలిదానాల వల్లే నేడు మనం భారత యూనియన్‌లో అంతర్భాగమై గర్వంగా జీవిస్తున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఆపరేషన్ పోలో ప్రారంభ దినోత్సవం (సెప్టెంబర్ 13) సందర్భంగా ఆదివారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న చారిత్రక యుద్ధ ట్యాంక్ వద్ద తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించి, మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ, ట్యాంక్‌బండ్‌పై కొలువై ఉన్న యుద్ధ ట్యాంక్ తెలంగాణ ప్రజలకు ఒక నిరంతర స్ఫూర్తి కేంద్రమని కొనియాడారు. "ఒకవేళ ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ నిర్ణయం, కే.ఎం. మున్షీ గారి చొరవ, ఆపరేషన్ పోలో సైనిక చర్య లేకపోయి ఉంటే నేడు మనం చూస్తున్న హైదరాబాద్ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించడానికే భయమేస్తుంది. దేశ సమగ్రతకు అడ్డంకిగా మారిన విద్రోహ శక్తులను అంతమొందించేందుకు 1948 సెప్టెంబర్ 13న పటేల్ గారు ఆపరేషన్ పోలోకు శ్రీకారం చుట్టారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ పోరాటంలో ఎంతోమంది సైనికులు ప్రాణాలర్పించి, సెప్టెంబర్ 17 నాటికి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించారని ఆయన గుర్తుచేశారు. సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ ప్రజలందరికీ అత్యంత పవిత్రమైన విమోచన దినోత్సవమని, ఈ రోజును ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా ఉద్యమిస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి, మజ్లిస్ (వీ×వీ) పార్టీకి భయపడి వెనకడుగు వేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గాంధీ భవన్‌లో పార్టీ కార్యక్రమంగా జరుపుకుంటోందే తప్ప, ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో నిర్వహించకుండా 'ప్రజాపాలన' పేరిట అసలు చరిత్రను మరుగున పరుస్తోందని విమర్శించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం అమరవీరుల త్యాగాలను విస్మరించడం క్షమించరాని

నేరమని ఆయన మండిపడ్డారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ స్వాతంత్ర్య పోరాట చరిత్ర, వందేమాతరం

విలువలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పాఠశాల పాఠ్యపుస్తకాల్లో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన పోరాట చరిత్రను సమగ్రంగా పొందుపరచాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సైనికుల త్యాగాలను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీను ఆయన ప్రత్యేకంగా అభినందించారుభారీ వర్షానికి మత్తడి పోస్తున్న మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద చెరువుమహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భీముని పాదం జలపాతం జల ధార

# నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కోదాడలో జాబ్ మేళా



బి యువత జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి బిరాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి.

సూర్యాపేట, సెప్టెంబర్ 13 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 19 న కోదాడ పట్టణంలోని సి సి రెడ్డి కాన్వెంట్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డితో కలిసి కోదాడ సి సి కాన్వెంట్ లో ఈ నెల 19 న నిర్వహించే మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కంపెనీ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో ఐటి, సేవా, నిర్మాణ, వాణిజ్య, ఫార్మారంగలకు చెందిన 250 నుండి 300 పైచిలుకు కంపెనీలు హాజరుకానుండగా, సుమారు 4000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు పక్కన ఉన్న ఖమ్మం జిల్లా నుండి నిరుద్యోగ యువత ఇట్టి ఉద్యోగాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అలాగే సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల నుండి నిరుద్యోగులు అత్యధికంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గ గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని, ఇంటర్వ్యూలలో ఉద్యోగం సంపాదించిన వారికి వెంటనే ఆర్డర్స్ ఇవ్వబడుతాయన్నారు.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలి : గతేడాది అక్టోబరులో హుజుర్ నగర్ లో నిర్వహించిన ఉద్యోగ మేళాకు అనూహ్యంగా 45 వేల మందికి పైగా నిరుద్యోగులు తరలిరావడంతో తీవ్ర రద్దీ నెలకొందని, ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. అభ్యర్థుల తాకిడిని క్రమబద్ధీకరించేందుకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మూడు వేర్వేరు సమయ స్లాట్లుగా విభజించాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకుని తమకు కేటాయించిన సమయానికే రావాల్సి ఉంటుందన్నారు. ఏర్పాట్లు సజావుగా చేయాలి : సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చేవారికి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. జాబ్ మేళా ప్రాంగణం వద్ద 5 వేల నుంచి 10 వేల వరకు వాహనాలు నిలిపేందుకు వీలుగా భారీ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అభ్యర్థులతో పాటు వారి వెంట వచ్చే తల్లిదండ్రుల కోసం ఉచిత భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. అభ్యర్థుల ప్రతిభను బట్టి ఎంపికలు : జాబ్ మేళాలో 27 వేల ఉద్యోగాలు ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఆ అంకెలను చూసి అభ్యర్థులు భ్రమపడొద్దని స్పష్టం చేశారు. కేవలం ప్రకటనల ఆధారంగా కాకుండా, అభ్యర్థుల ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాల ఆధారంగానే పారదర్శకంగా ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అన్ని అర్హతలు కలిగిన దాదాపు 3,000 నుంచి 4,000 మంది నిరుద్యోగులకు పక్కాగా ఉద్యోగ నియామక పత్రాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పైరవీలకు, సిఫార్సులకు తావులేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక నిర్వహణ కమిటీని నియమించినట్లు వివరించారు. జిల్లా అధికార యంత్రాంగం నిరంతరం సమన్వయం చేసుకుంటూ మేళా సాఫీగా సాగేలా చూడాలని మంత్రి ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల యువతీ యువకులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవితకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ లలో ఉత్తీర్ణత సాధించిన వారు , అలాగే 2026 లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హత ఉంటుందని తెలిపారు మంత్రి తెలిపారు. అనంతరం కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జాబ్ మేళా కు హాజరగు నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనదని క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఒక అభ్యర్థి అయిదు కంపెనీల ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. అంతకుముందు మంత్రి సి సి రెడ్డి కాన్వెంట్ గ్రౌండ్ ను కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ జిల్లా అధికారులతో కలిసి పరిశీలించి స్టాల్స్, భోజన వసతి తదితర ఏర్పాట్ల గురించి మంత్రి పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు,వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసినందుకు బాధపడడం లేదు



**మహబూబాబాద్, సెప్టెంబర్ 13**

: మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం పట్ల మేం బాధపడడం లేదు, మంత్రి పదవి ఉన్నంతకాలం ఏ చిన్న తప్పు కూడా చేయలేదు, మాకు పార్టీ మారే ఆలోచన లేదు, కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతాం, వచ్చే ఎన్నికల్లో వరంగల్ తూర్పు టికెట్ నాకే వస్తుంది, గెలుపు కూడా నాదే, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం, మున్సిపల్ ఎన్నికల్లో నవీన్ రాజ్ ఆధ్వర్యంలో 24 కార్పొరేటర్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తామని మాజీ మంత్రి కొండ సురేఖ, మురళి దంపతులు స్పష్టం చేశారు. ఆదివారం వరంగల్ నగరంలోని నాయుడు ఎన్ కన్వెన్షన్ హాల్ లో తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో కొండా సురేఖ మురళి దంపతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకనుండి ఎవరైనా తమ పట్ల మాట్లాడాలనుకుంటే ఒళు ళ్ళ దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. తమకు అధిష్టానం నుండి ఎటు వెళ్లొద్దని ఫోన్లు వస్తున్నాయని, తాము పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మళ్ళీ తనకే కాంగ్రెస్ టికెట్ ఇస్తుందని, ఎన్నికల్లో గెలవడంతో పాటు మళ్ళీ మంత్రిని అవుతానని సురేఖ స్పష్టం చేశారు. మైకు చూడక చాలా రోజులైందని, అలాంటివారు ఏది పడితే అది మాట్లాడుతూ ఊగిపోతున్నారని, దమ్ముంటే తనపై పోటీ చేసి గెలవాలని పరోక్షంగా ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పై వ్యాఖ్యానించారు. భద్రకాళి ఆలయ కమిటీ విషయంలో హంగామా చేసిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి పదవి తొలగిస్తే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పశ్చిమ నియోజకవర్గం లో నాడు వినయ్భాస్కర్ ను తట్టుకోలేక

మమ్మల్ని బతిమాలి తీసుకెళ్లేవాడని ఎద్దేవా చేశారు. స్థానిక డివిజన్లో కార్పొరేటర్ ను గెలిపించుకునే స్థాయి కూడా సారయ్యకు లేదని విమర్శించారు. పది రోజుల నుండి కార్యకర్తలు ఎంతో బాధపడుతున్నారని, సుమంత్ బెయిల్ కోసం కార్యకర్తలను కలవడం ఆలస్యం అయిందన్నారు. ఇప్పుడున్న నాయకులు పొద్దున ఒక పార్టీలో పార్టీ మధ్యాహ్నం ఒక పార్టీలో తిరుగుతున్నారన్నారు. తాను ఎప్పుడు పదవుల కోసం ఆరాటపడలేదని, వైయస్సార్ చనిపోయాక ఇక్కడున్న గుంట నక్కలు తమను మోసం చేశారన్నారు. కేసీఆర్ సూచనతో వరంగల్ తూర్పులో పోటీ చేసి అప్పటి మంత్రిని 55 వేల మెజారిటీతో ఓడించానన్నారు.

పరకాల శాసనసభ్యులు చల్ల ధర్మారెడ్డి అక్రమంగా సంపాదించాడని, తాను చిన్న తప్పు కానీ చిన్న మచ్చ లేకుండా మూడు శాఖలను సమర్ధవత్తంగా నిర్వహించానన్నారు. పదవి అనేది అలంకారం మాత్రమే పని చేయాలనుకుంటే పదవి అక్కర్లేదన్నారు. అనివార్య కారణాలవల్ల టిఆర్ఎస్ పార్టీలోకి పోయాము కానీ ఎవరు ఆ పార్టీ నుండి వెళ్లగొట్టలేదన్నారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, సారీ చెప్పాల్సిన పరిస్థితి తమకు లేదన్నారు. సురేఖ, మురళి ది ఒకే మాట, ఒకే బాట అంటూ స్పష్టం చేశారు.

# బీసీల మలిదశ ఉద్యమానికి సమాయత్తం కావాలి

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం**

**ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకల్లో 'బీసీల సింహనాదం' గ్రంథావిష్కరణ**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 13**

:బీసీల హక్కులు, విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్ల సాధన కోసం మలిదశ ఉద్యమానికి బీసీలు సమాయత్తం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. విద్యానగర్ బీసీ భవన్‌లో ఆదివారం రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు.



ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక రచయిత కడియాల సురేష్‌కుమార్ రచించిన 'బీసీల సింహనాదం--ఆర్.కృష్ణయ్య జీవిత చరిత్ర' గ్రంథాన్ని ఆర్.కృష్ణయ్య, ఆయన తనయుడు, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. ఐదు దశాబ్దాలుగా కృష్ణయ్య సాగించిన బీసీ ఉద్యమ ప్రస్థానం, విద్యా, సామాజిక, రాజకీయ చైతన్యం కోసం చేసిన పోరాటాలను గ్రంథంలో పొందుపరిచినట్లు రచయిత తెలిపారు.

గుజ్జ సత్యం మాట్లాడుతూ బీసీలను రాజ్యాధికారం దిశగా నడిపించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తన ఉద్యమ ప్రస్థానాన్ని పుస్తక రూపంలో తీసుకువచ్చిన కడియాల సురేష్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సి. రాజేందర్, జి. అనంతయ్య, పగిల్ల సతీష్ కుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేక్ కటింగ్, అన్నదానం, రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

స్పందన
తెలుగు దినపత్రిక

# ఆసియాకప్ టీ20 టోర్నీ..
# భారత అమ్మాయిలదే

**ఫైనల్లో లంకపై ఘనవిజయం**
**విజృంభించిన శ్రీచరణి, దీప్తి**
**మెరిసిన షెఫాలి, స్మృతి**

**ఢిల్లీ :** ఆసియాకప్ టీ20 టోర్నీలో భారత మహిళల జట్టే విజేతగా నిలిచింది. టోర్నీలో ఒక్క ఓటమి లేకుండా హర్మన్‌ప్రీత్ బృందం టైటిల్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 72 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసింది. షెఫాలి వర్మ (68; 39 బంతుల్లో 9x4, 2x6), స్మృతి మంధాన (59; 39 బంతుల్లో 5x4, 3x6) మెరుపులతో మొదట భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఛేదనలో తెలుగమ్మాయి శ్రీచరణి (4/20), దీప్తి శర్మ (3/19) విజృంభించడంతో లంక 20 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. చమరి ఆటపట్టు (36), నీలాక్షిక (22), విష్మి (20) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు.

శ్రీచరణి, దీప్తి మాయాజాలం: ఛేదనలో లంకకు ఆరంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్ ఇమేషా (4)ని క్రాంతి గౌడ్ బౌల్డ్ చేసి భారత్‌కు శుభారంభం అందించింది. తొలి ఓవర్లోనే వికెట్ పడడంతో లంక బ్యాటర్లు నెమ్మదిగా ఆడారు. 4 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 21 పరుగులే! ఈ స్థితిలో కెప్టెన్ చమరి ఆటపట్టు.. షెఫాలి బౌలింగ్‌లో 6, 4తో స్కోరు కదిలించింది. ఆ తర్వాత ప్రేమ బౌలింగ్‌లోనూ చమరి సిక్స్, ఫోర్ బాదడంతో 9 ఓవర్లకు 61/1తో లంక కాస్త కోలుకుంది. కానీ సాధించాల్సిన రన్‌రేట్ మాత్రం తగ్గలేదు. దీప్తి వేసిన పదో ఓవర్లో భారీ షాట్‌కు వెళ్లిన చమరి.. స్టంపౌట్‌గా వెనుదిరిగింది. అదే ఓవర్లో విష్మి గుణరత్నే (20) కూడా ఔటైపోవడంతో లంకపై ఒత్తిడి మరింత పెరిగింది. 14వ ఓవర్లో హర్షిత (9)ను శ్రీచరణి తన బౌలింగ్‌లోనే క్యాచ్ పట్టి డగౌట్‌కు పంపడంతో లంకకు ఇంకో దెబ్బ తగిలింది. సమీకరణం (36 బంతుల్లో 94 పరుగులు) మరింత కఠినంగా మారింది. 16 ఓవర్లో కవీష (7), నీలాక్షిక (22)లను శ్రీచరణి.. తర్వాతి ఓవర్లో హాసిని (1)ని షెఫాలి ఔట్ చేయడంతో లంక కనీస పోరాటం చేయలేకపోయింది. చివరి 5 వికెట్లను ఆ జట్టు 11 పరుగులకే కోల్పోయింది.

షెఫాలి, స్మృతి మెరుపులు: మొదట భారత్ భారీ స్కోరు చేసిందంటే ఓపెనర్లు షెఫాలి, స్మృతి దూకుడే కారణం. టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌ను స్మృతి బౌండరీతో మొదలుపెట్టగా.. తర్వాత షెఫాలి చెలరేగింది. మిథాలి వేసిన మూడో ఓవర్లో రెండు ఫోర్లు, తర్వాత చమరి ఆటపట్టు (5వ ఓవర్) బౌలింగ్‌లో 4, 6, 6తో షెఫాలి స్కోరు పెంచింది. స్మృతి కూడా షాట్లకు దిగడంతో 12 ఓవర్లకు 121/0తో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది. అప్పటికే షెఫాలి 24 బంతుల్లో, స్మృతి 35 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. భారత్ జోరు చూస్తే తేలిగ్గా 200 పరుగులు సాధిస్తుందేమో అనిపించింది. కానీ తర్వాత భారత్ ఇన్నింగ్స్ అనూహ్యంగా కుదుపునకు లోనైంది. కుదురుకున్న షెఫాలి, స్మృతితో పాటు రిచా (17), హర్మన్‌ప్రీత్ 14), దీప్తి (5) స్వల్ప వ్యవధిలో ఔటైపోయారు. 38 పరుగుల తేడాతో 5 వికెట్లు పడిపోయాయి. దీంతో భారత్ 18.5 ఓవర్లకు 167/5తో నిలిచింది. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ చివరి రెండు బంతులకు కమలిని (15 నాటౌట్; 5 బంతుల్లో 1x4, 1x6).. 4, 6 కొట్టడంతో స్కోరు 180 దాటింది. ఆసియాకప్ పదిసార్లు జరిగితే ఎనిమిదిసార్లు (2004, 2005, 2006, 2008, 2012, 2016, 2022, 2026) భారతే విజేతగా నిలిచింది. బంగ్లాదేశ్ (2018), శ్రీలంక (2024) ఒక్కోసారి నెగ్గాయి. భారత్ టీ20, వన్డే ఫార్మాట్లలో 4సార్ల చొప్పున కప్‌ను గెలిచింది.









## టెస్టు క్రికెట్‌కు పాక్ అపకారం చేస్తోంది

**దినేశ్ కార్తీక్ కీలక వ్యాఖ్యలు**



పాకిస్థాన్ క్రికెట్‌లో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై భారత మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్టుల్లో గొప్ప చరిత్ర కలిగిన పాక్.. ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా టెస్టు దేశాలతో పోటీపడే స్థితిలో లేదని వ్యాఖ్యానించాడు. తాజాగా ఇంగ్లాండ్‌పై మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో దినేశ్ కార్తిక్ ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశాడు. "నేను ఇంగ్లాండ్ జం పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌కు వ్యాఖ్యానం చేసినప్పుడు ఈ పాక్ జట్టు చాలా సాధారణంగా అనిపించింది. మొదటి రెండు టెస్టుల్లో వారు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేదు. పిచ్‌లు చాలా కఠినంగా ఉన్నాయి. కానీ, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేనంత క్లిష్టమైన పిచ్‌లు కావవి. పాకిస్థాన్ జట్టు టెస్ట్ క్రికెట్‌కు అపకారం చేస్తోందని నాజర్ హుస్సేన్ (ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్) అన్నాడు. నేను అతనితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. చివరి టెస్టులో రజావుల్లా బాగా రాణించాడు. అతను ఆరంభం నుంచే జట్టులో ఎందుకు లేడు? అసలు ఎంపిక ప్రక్రియలో ఏం జరుగుతోంది? ఎలాంటి ఆటగాళ్లను తీసుకుంటున్నారు? కెప్టెన్సీ మార్పులు, కోచ్‌ల మార్పులు అన్నీ అస్థిరంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రభావం వారి ఆటతీరులో స్పష్టంగా కనిపిస్తోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వారు ఆశించిన స్థాయిలో ఆడలేదు. కనీసం గట్టి పోటీనిచ్చేలా కూడా అనిపించలేదు. నిజాయితీగా చెప్పాలంటే, ప్రస్తుత పరిస్థితుల్లో వారు చాలా టెస్ట్ ఆడే దేశాలతో పోటీ పడగలరని నాకు అనిపించడం లేదు. ఇది నిజంగా బాధాకరం. టెస్ట్ క్రికెట్‌లో పాక్‌కు గొప్ప చరిత్ర ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో వారు ఆ స్థాయికి ఏమాత్రం దగ్గరగా లేరు. పాక్ క్రికెట్‌లో పరిస్థితి ఆందోళనకరంగా కనిపిస్తోంది. సరైన వ్యక్తులు దీనిని గమనించి తిరిగి గాడిలో పెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో అది అంత సులభమైన పనిలా అనిపించడం లేదు" అని దినేశ్ కార్తీక్ వివరించాడు.

# తొలి టీ20లో అఫ్గానిస్థాన్‌పై
# భారత్ ఘనవిజయం

**అదరగొట్టిన అభిషేక్**

దిల్లీ : అభిషేక్ శర్మ (82; 32 బంతుల్లో 7x4, 7x6) రెచ్చిపోవడంతో ఆదివారం అఫ్గానిస్థాన్‌తో తొలి టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట అఫ్గానిస్థాన్ 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. అజ్మతుల్లా (64 నాటౌట్; 44 బంతుల్లో 4x4, 4x6) టాప్ స్కోరర్. అర్ష్‌దీప్ (3/19), వరుణ్ చక్రవర్తి (1/16), అక్షర్ పటేల్ (1/27) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అభిషేక్‌తో పాటు ఇషాన్ కిషన్ (42; 33 బంతుల్లో 5x4, 1x6) మెరవడంతో లక్ష్యాన్ని భారత్.. 13.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. రెండో టీ20 మంగళవారం జరుగుతుంది.

దంచేశారు..: ఛేదనలో ఓపెనర్ సంజు శాంసన్ (10) త్వరగానే నిష్క్రమించినా.. అది భారత్ ఇన్నింగ్స్‌పై ఎలాంటి ప్రభావం చూపించలేదు. కారణం మరో ఓపెనర్ అభిషేక్ శర్మ. అతడు.. అఫ్గాన్ బౌలింగ్‌ను ఉతికారేశాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మూడో ఓవర్లో అజ్మతుల్లా బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ దంచేసిన అతడు.. అదే ఊపు కొనసాగించాడు. ఇషాన్ అతడికి సహకరించాడు. అభిషేక్ ఫోర్, సిక్స్.. ఇషాన్ ఫోర్, సిక్స్ బాదడంతో ఓ ఓవర్లో ఫారూఖి 26 పరుగులు సమర్పించుకున్నాడు. అభిషేక్ 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత రషీద్ ఓవర్లో వరుసగా 6, 4 బాదిన అతడు.. నూర్‌ను వరుసగా 6, 6తో శిక్షించాడు. 10 ఓవర్లలో 130/1తో టీమ్‌ఇండియా విజయం ఖాయమైపోయింది. అభిషేక్, ఇషాన్ ఔటైనా.. కెప్టెన్ శ్రేయస్ (8 నాటౌట్), తిలక్ వర్మ (3 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. అభిషేక్, ఇషాన్ జంట రెండో వికెట్‌కు 53 బంతుల్లోనే 121 పరుగులు జోడించింది.

అఫ్గాన్ కట్టడి: అంతకుముందు భారత్ బంతితో అఫ్గానిస్థాన్‌కు కళ్లెం వేసింది. నిజానికి అఫ్గాన్ 158 చేయడం కూడా ఎక్కువే. అర్ష్‌దీప్ అక్షర్, వరుణ్ చాలా పొదుపుగా బౌలింగ్ చేశారు. బుమ్రా (1/26).. 16 డాట్ బాల్స్ వేశాడు. అఫ్గాన్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. గుర్బాజ్‌ను ఔట్ చేయడం ద్వారా రెండో బంతికే ఆ జట్టును బుమ్రా దెబ్బతీశాడు. నాలుగో ఓవర్లో 38/1తో ఉన్న అఫ్గాన్.. భారత బౌలర్ల ధాటికి 5 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. ఇషాన్ కిషన్ సూపర్ ఫీల్డింగ్‌కు ఇబ్రహీం జద్రాన్ (11) రనౌట్ కాగా.. సెదికుల్లా (13)ను అర్ష్‌దీప్, నైబ్ (2)ను అక్షర్, రసూలి (2)ని వరుణ్ చేశారు. అయితే 43/5తో నిలిచిన అఫ్గానిస్థాన్‌ను అజ్మతుల్లా, నబి (33) ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించారు. 17వ ఓవర్లో నబిని అర్ష్‌దీప్ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యం విడిపోయింది. నితీష్ (2 ఓవర్లలో 30), దూబె (1 ఓవర్లో 21) భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఆఖరి మూడు ఓవర్లలో అఫ్గాన్ 2 వికెట్లు కోల్పోయి 29 పరుగులు చేసింది.








# 'ఆదర్శ కుటుంబం'

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివి క్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకె క్కుతున్న 'ఆదర్శ కుటుం బం'పై ప్రేక్ష కుల్లో భారీ అంచనా లు నెలకొ న్నాయి. వెంకటేష్‌కు ఉన్న కుటుంబ ప్రేక్షకుల ఇమేజ్‌కు త్రివి క్రమ్ శైలి కథనం, వినోదం, భావో ద్వేగాలు తో డవుతుండ టంతో ఈ సినిమాపై మొదటి నుంచీ ఆసక్తి ఏర్పడింది. శ్రీనిధి శెట్టికథానా యికగా నటిస్తుం డటంతో సిని మాపై అంచనాలు మరింత పెరిగా యి. ఈ సాయం త్రం 4.06 గంటలకు టీజర్ 'ఆదర్శ కుటుం బం' టీజర్ విడు దలకు చిత్ర బృందం కొత్త సమ యాన్ని ప్రక టించింది. తొలుత అనుకున్న సమయానికి టీజర్ విడుదల కాక పోవడంతో అభిమా నుల్లో కొంత ఉత్కంఠ నెలకొంది. తాజా గా ఈ సాయం త్రం 4 గంటల 6 నిమి షాలకు టీజ ర్‌ను విడుదల చేయను న్నట్లు మేకర్స్ వెల్లడిం చారు.

## 'రామ్--సంయుక్త' జోడీ.. కొత్త ప్రయోగానికి శ్రీకారం

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ, తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా సంయుక్త ఎంపికైంది. సంయుక్త పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ కొత్త కలయికపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.పుట్టినరోజున అధికారిక ప్రకటన సంయుక్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆమెను తమ చిత్రంలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు చిత్రబృందం ప్రత్యేక ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. ఇప్పటివరకు రామ్ కనిపించిన పాత్రలకు భిన్నంగా ఈ సినిమాలో ఆయన సరికొత్త అవతారంలో కనిపించనున్నట్లు సమాచారం.మానసిక సంఘర్షణలతో సాగే కథఈ చిత్రాన్ని మానసిక సంఘర్షణలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. నేరం, రహస్యం, మానసిక ఉద్వేగాల నేపథ్యంలో కథ సాగనున్నట్లు తెలుస్తోంది. కథలోని ఉత్కంఠభరిత అంశాలతో పాటు భారీ పోరాట సన్నివేశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. భారీ వ్యయంతో నిర్మాణంరామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. నటుడిగా ఇప్పటికే తనదైన గుర్తింపు తెచ్చుకున్న రామ్.. దర్శకుడిగా తొలిసారి బాధ్యతలు చేపడుతున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుందని చిత్రవర్గాలు చెబుతున్నాయి.





## రమ్యకృష్ణకు వెండి పళ్లెంలో వీడ్కోలు..

**ప్రముఖ దర్శకుడు కృష్ణారెడ్డి తన సినీ ప్రయాణంలోని పలు భావోద్వేగ సంఘటనలను ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. నటి రమ్యకృష్ణతో తనకున్న అనుబంధం, దివంగత నటి సౌం దర్య అకాల మరణం తనపై చూపిన ప్రభావం గురించి ఆయన మాట్లా డారు. కళాకారుల పట్ల గౌరవం, మానవీయ విలువలకు తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు.**



# పాత్రలే ముఖ్యం..

**కథానాయికగా వరుస అవకాశాలు దక్కించుకోవడం కంటే తనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో నటించడమే ముఖ్యమని అంటోంది అందాల భామ ఆషికా రంగనాథ్.** గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటిగా తన ప్రతిభను చూపించే విభిన్న పాత్రల్లో కనిపించాలనేదే తన కోరిక అని ఆమె చెప్పింది. తాజాగా ఆషికా చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

కన్నడ నుంచి టాలీవుడ్‌కు..

ఆషికా రంగనాథ్ కన్నడ చిత్రాలతో కథానాయికగా గుర్తింపు తెచ్చుకుంది. 2016లో 'క్రేజీ బాయ్' సినిమాతో వెండితెరకు పరిచయమైంది. ఈ చిత్రంలోని నటనకు ఉత్తమ తొలి నటిగా సైమా అవార్డుకు నామినేషన్ దక్కింది. ఆ తర్వాత 'రాంబో 2', 'రేమో', 'మధగజ' వంటి కన్నడ చిత్రాల్లో నటించింది. 'మధగజ' సినిమాతో సైమా ఉత్తమ నటి అవార్డును సైతం అందుకుంది. తెలుగు ప్రేక్షకులకు దగ్గరగా..

2023లో నందమూరి కల్యాణ్‌రామ్ సరసన అమిగోస్' సినిమాతో తెలుగు తెరకు **పరిచయమైంది. అనంతరం నాగార్జునతో కలిసి 'నా సామిరంగ'లో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. ప్రస్తుతం చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతున్న** 'విశ్వంభర'లోనూ ఆమె నటిస్తోంది. తెలుగు, తమిళ చిత్రాలతో పాటు కన్నడలోనూ వరుస అవకాశాలు అందుకుంటోంది.

స్టార్ హీరోల సినిమాల కంటే..

తాజాగా తన కెరీర్ గురించి ఆషికా మాట్లాడుతూ.. సినిమాల సంఖ్య కంటే పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని తెలిపింది. కథానాయికగా అవకాశాలు రావడం ఒక ఎత్తైతే.. తాను నటించే ప్రతి సినిమాలోనూ కొత్తగా కనిపించాలనేదే తన కోరిక అని చెప్పింది. స్టార్ హీరోల సినిమాల్లో నటించడం కంటే తన పాత్రకు ప్రాధాన్యం ఉండటం ముఖ్యమని స్పష్టం చేసింది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుగ్గా ఉండే ఆషికా.. తన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ అలరిస్తోంది.




## 'మండాడి'కి పెరుగుతున్న ఆదరణ

కోలీవుడ్‌లో ప్రస్తుతం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాల్లో 'మండాడి' ఒకటిగా నిలుస్తోంది. సూరి, సుహాస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ట్రైలర్‌తోనే ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా అద్భుతమైన విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచాయి. విడుదల తర్వాత కూడా ఈ క్రేజ్ కొనసాగుతున్నట్లు బాక్సాఫీస్ బుకింగ్స్ గణాంకాలు సూచిస్తున్నాయి. 'మండాడి'కి తొలి రోజు తమిళనాడులో మంచి ప్రారంభం లభించినట్లు సమాచారం. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ వేదికలో మొదటి రోజున సుమారు 1.20 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు తెలుస్తోంది. అయితే తెలుగు వెర్షన్‌కు తొలి రోజు పెద్దగా స్పందన రాలేదు. దీంతో ప్రారంభంలో సినిమా తమిళనాడు మార్కెట్‌పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. అయితే రెండో రోజుకు పరిస్థితి మారిపోయింది. ప్రేక్షకుల స్పందన, మౌత్‌టాక్ కారణంగా బుకింగ్స్ ఒక్కసారిగా పుంజుకున్నాయి.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780